క్లుప్తంగా

దశావతార విగ్రహ ప్రతిష్ట



విగ్రహాలను ప్రతిష్టిస్తున్న అతిథులు, దాతలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం దశావతార విగ్రహాలను ప్రతిష్టించారు. ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, నరసింహ, వామావతారం, మత్స్యావతారం, వరాహావతారం, పరుశరామ, కూర్మావతార, బుద్ధావతారం, కల్కి అవతారం విగ్రహాలను ప్రతిష్టించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జీఎం పి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, అర్చకులు మనోజ్ స్వామి, హరినారాయణ స్వామిలు దశావతార విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విగ్రహాల దాతలు, వారి కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఎస్ 6 టెక్నాలజీపై అవగాహన



శిక్షణా శిబిరంలో పాల్గొన్న మెకానిక్‌లు

గాజువాక : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు నూతనంగా విడుదలైన భారత్ స్టేజ్ (బీఎస్) 6 ద్విచక్ర వాహనాలపై టూవీలర్ మెకానిక్‌లకు అవగాహన కల్పించారు. ప్రగతి టూవీలర్ మెకానిజం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి బీఎస్6 సాంకేతికతను వివరించారు. కార్యక్రమంలో ట్రైనర్ టి.ఆర్.ఆనంద్‌బాబు, అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదరరావు, తుంగ్లాం శ్రీను, రెడ్డిపిల్లి రాజు, పి.నాయుడు, ఎస్.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి సహస్ర నామార్చన



శ్రీవారికి పుష్పాలతో అలంకరణ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారికి నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శ్రావణ మాసం పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి విశేష పుష్పాలతో సహస్రనామార్చనలు నిర్వహించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

షిర్డీసాయి శాంతి ధామం చైర్మన్‌గా సత్యంబాబు



కొత్త కమిటీలను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి ధామం చైర్మన్‌గా కొల్లి సత్యంబాబు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో కొత్త కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా బి.రవిశేఖర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు పాత కమిటీ నుంచి కొత్త కమిటీ బాధ్యతలు స్వీకరించింది. ది సమతా నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బొర్రా హేమంతరావు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా మన్మథరావు, కోశాధికారిగా మహ్మద్ ఖాజా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొత్త కమిటీలను షిర్డీసాయి శాంతి ధామంలో ఘనంగా సత్కరించారు.

నందనవనం..'బృందావనం'

- సుందరంగా రూపుదిద్దుకున్న వుడా ఫేజ్-2 పార్క్
- ఓపెన్ జిమ్, ఆటల సామగ్రి ఏర్పాటు
- పాత్‌వే, వాకింగ్ ట్రాక్, కాంపౌండ్ వాల్ మరమ్మతులు

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్ వుడా ఫేజ్-2 బృందావనం పార్కును సుందరంగా తీర్చిదిద్దారు. శిథిల ప్రహరితో, ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో నిండి ఉన్న బృందావనాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. వృద్ధులకు కాలక్షేపం, పిల్లలకు వినోదం అందిస్తోంది. సుమారు రూ.18 లక్షల వ్యయంతో పార్కును జీవీఎంసీ అభివృద్ధి చేసింది. పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడంతో కాలనీ వాసులు సంతోషకం వ్యక్తం చేస్తున్నారు.

పార్కు ఆవరణలో పిల్లలు ఆడుకోవడానికి ప్లే మెటీరియల్‌ను అమర్చారు. అలాగే పెద్దలు, పిన్నలు వ్యాయామం చేసుకోడానికి వీలుగా ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. వీటికి తోడు వాకింగ్ ట్రాక్, పాత్‌వేలను పునర్నిర్మాణం చేపట్టారు. శిథిలావస్థలో ఉన్న ప్రహరిని మరమ్మతులు చేపట్టి రంగులు అద్దారు. ఆవరణాన్ని అందంగా తీర్చిదిద్దడంతో కాలనీలోని పెద్దలు, వృద్ధులు, పిల్లలు సరదాగా బృందావనంలో సేదతీరుతున్నారు.



పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు, ఓపెన్ జిమ్



ఆధునికీకరించిన పార్కు ఆవరణలోని సామాజిక భవనం

పిల్లలకు ఆటవిడుపు



ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాలలో కనీసం ఆటలాడుకోడానికి అవకాశం లేకుండా చదువులు ఉన్నాయి. నిత్యం పుస్తకాలతో కుస్తీలు పడే బాలలకు పార్కులో ప్లే మెటీరియల్ ఏర్పాటు చేయడం, పెద్దలకు కూడా ఓపెన్‌జిమ్ అందుబాటులోకి రావడంతో సంతోషంగా ఉంది. పిల్లలు పాఠశాలల నుంచి వచ్చిన తరువాత కొంత సమయం ఆటవిడుపుగా ఉండేందుకు అవకాశం కల్పించారు. సంతోషంగా ఉంది.

– ఎస్.శంకరరావు, దువ్వాడ

సేదదీరేందుకు వేదికైంది



పెద్దలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసుకోడానికి, కొద్దిసేపు సేదతీరడానికి బృందావనం పార్కు చక్కటి వేదికగా మారింది. గతంలో ఈ పార్కులోకి ప్రవేశించడానికి ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు పార్కును అందంగా తీర్చిదిద్దారు.

– పి.చంద్రశేఖర్, రాజీవ్‌నగర్

భూ ఆక్రమణలపై 'ఉక్కు'పాదం

- అక్రమ నిర్మాణాల నేలమట్టం
- ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు
- అధికారుల స్పందనపై స్థానికుల్లో హర్షాతిరేకాలు



స్టీల్‌ప్లాంట్ స్థలం ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: భూ ఆక్రమణలపై అటు రెవెన్యూ అధికారులు, ఇటు స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే ఎంతటి వారిపైనా చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని స్పష్టం చేస్తున్నారు. పెదగంట్యాడ మండల తహసీల్దార్ ఆదేశానుసారం రెవెన్యూ సిబ్బంది ఆదివారం కూడా ఆక్రమణలను తొలగించారు. అయితే ఆక్రమణదారులు మాత్రం వెనక్కి తగ్గలేదు. శనివారం తొలగించిన ఆక్రమణలను ఆదివారం మళ్లీ నిర్మిస్తుండగా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది వచ్చి ఆయా అక్రమ కట్టడాలను పూర్తి స్థాయిలో తొలగించి నేలమట్టం చేశారు. ఇప్పటి వరకూ జీవీఎంసీ 65వ వార్డు పరిధిలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం.. ఆపై అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం పరిపాటిగా మారింది. దీనిపై అధికారులకు ఫిర్యాదులు అందకముందే ఆక్రమణదారులు కోర్టుకెళ్లడం.. స్టేటస్‌కో తీసుకురావడం.. దానిని బూచిగా చూపించి అధికారుల చేతులు కట్టేయడం షరా మామూలుగా మారింది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని కేఎల్‌రావు నగర్ పక్కన, టిడ్కో హౌసింగ్‌కు ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 64/1డిలో ఉన్న స్టీల్‌ప్లాంట్ భూమిలో స్థానిక కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు (కేబుల్ మూర్తి) అన అనుచరుడైన నాయుడుతో అక్కడ షెడ్లు నిర్మించి ఆక్రమణకు పాల్పడడం సంచలనమైంది. ఈ ఆక్రమణపై ఒక్కసారిగా అటు దళితులతో పాటు ఇటు తెలుగుదేశం పార్టీ వార్డు నాయకుల్లో ఆగ్రహం పెల్లుబుకింది. వెంటనే కార్పొరేటర్ ఆగడాలపై బహిరంగంగానే ఆరోపణలు చేశారు. అంతేకాకుండా పెదగంట్యాడ తహసీల్దార్ లోకవరపు రామారావుకు లిఖితపూర్వక ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన ఆక్రమిత స్థలంలో నిర్మించిన రేకులషెడ్లను తొలగించారు. అధికారులు సకాలంలో స్పందించి అక్రమాలను అడ్డుకోవడంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆక్రమణదారులను అలాగే వదిలేయకుండా వారిపై లాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేయాలని, ఈ వార్డులో మరిన్ని భూ ఆక్రమణలు ఉన్నాయని, వాటిపై కూడా దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

విచారణ జరిపిస్తాం

స్టీల్‌ప్లాంట్ భూములను ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుంటాం. 65వ వార్డులోని కేఎల్‌రావు నగర్ సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆక్రమణకు గురైనట్టు మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే అక్కడ నిర్మాణాలను తొలగించాం. దీనిపై మరింత లోతుగా విచారణ జరిపిస్తాం. ఆక్రమణకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడం.

– డి.ఎస్.సునీత,
స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

కావాలనే 'ఉక్కు' నిర్వీర్యం



మాట్లాడుతున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

అగనంపూడి: విశాఖ ఉక్కు స్టీల్‌ప్లాంట్ రాష్ట్ర ప్రజల ఆస్తిగా భావిస్తున్నామని, లక్షల మందికి ప్రత్యంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే సంస్థను కేంద్ర ప్రభుత్వం తనకు నచ్చిన వారికి కట్టబెట్టాలని చూస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని జీవీఎంసీ కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో కొనసాగుతున్న రిలే దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది అమరుల త్యాగఫలితం విశాఖ ఉక్కు కర్మాగారమన్నారు. తెలుగు ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని భావిస్తే ఛీత్కారం తప్పదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం లాభాలతో పయనించిన విశాఖ ఉక్కును పరిపరి విధాలుగా ఇబ్బందులకు గురిచేసి నేడు ఉత్పత్తిని హీనస్థితికి తీసుకువెళ్లడం, కేవలం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికేనని ప్రజలకు తెలుసన్నారు. ముడి సరుకును సరఫరా చేయకుండా చివరికి ఉత్పత్తి నిలిపివేసే స్థితికి తీసుకువెళ్లడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ముడిసరుకు సరఫరా చేసి సొంత గనులు కేటాయించాలని, తక్షణ సాయంగా మూడువేల కోట్ల నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు బొడ్డు పైడిరాజు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎన్.రామారావు, వరసాల శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, కరణం సత్యారావు, ఎం.కె.రెడ్డి, కె.పరంధామయ్య, ఎల్లేటి శ్రీను, కార్పొరేటర్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

గోడ కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ స్వామి అయ్యప్ప దేవాలయం సరిహద్దు గోడ కూల్చివేత వివాదస్పదమైంది. 35 ఏళ్ల క్రితం ఆలయానికి దాత ఇచ్చిన స్థలం తనదంటూ ఓ వ్యక్తి ఆలయ సరిహద్దు గోడను కూల్చివేశాడు. షీలానగర్ స్వామి అయ్యప్ప దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఏ.నాయుడు, కార్యదర్శి శేషగిరిరావు, నాతయ్యపాలెం బంగారుమాంబ అమ్మవారి ఆలయ ప్రతినిధి బంగారయ్య శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 35 ఏళ్ల క్రితం కర్రి సన్యాసిరావు, పార్వతమ్మ దంపతులు ఆలయానికి 205 గజాలు దానంగా ఇచ్చారన్నారు. ఆ స్థలంలో ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ సహకారంతో కాంపౌండ్ వాల్ నిర్మించామన్నారు. బుధ,శనివారాల్లో ఆ ప్రాంతంలోనే అన్నదానానికి వంటలు, స్కూల్ విద్యార్థులకు రాకపోకలకు ఉపయోగిస్తున్నామన్నారు. ఆగస్టు 15న గోడ కూల్చివేస్తుండగా ప్రశ్నిస్తే తమపై దురుసుగా ప్రవర్తించాడన్నారు. దీనిపై ఆలయ కమిటీ చర్చించిన అనంతరం గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

బొత్సకు అభినందనలు



బొత్సకు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఎన్నేటి రమణ తదితరులు



బొత్సను అభినందిస్తున్న పల్లా చినతల్లి, పెంటారావు

గాజువాక : స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణకు వైఎస్సార్‌సీపీ గాజువాక నాయకులు ఆదివారం అభినందనలు తెలిపారు. నగరంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అభినందనలు తెలిపినవారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, నాయకులు రెడ్డి జగన్నాథం, ఎన్నేటి రమణ, పల్లా చినతల్లి, పల్లా పెంటరావు, గాలి నూకరాజు, ద్వారపూడి బ్రహ్మం తదితరులున్నారు.

ఇదే స్ఫూర్తితో పనిచేయండి

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ ఉద్యోగుల సహకార పరపతి సంఘం 61వ మహాజన సభను విశాఖ డెయిరీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి డెయిరీ సీఈఓ ఎస్.వి. రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సొసైటీ అధ్యక్షుడు పీఎల్‌జీఈ ప్రసాద్ 2023–24 ఆర్థిక సంవత్సరంలో సొసైటీ ఆదాయ వ్యయాలను సభ్యులకు వివరించారు. సిబ్బందంతా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో సభ్యులకు వర్తింపజేయనున్న సంక్షేమ కార్యక్రమాలు, కార్యాచరణ ప్రణాళికలను తెలియజేశారు. ఈ సందర్భంగా వివిధ తరగతుల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన ఉద్యోగుల పిల్లలకు సీఎండీ రమణ బహుమతులు అందజేశారు. ప్రతీ ఏడాది కంటే ఈసారి సభ్యులకు మెరుగైన డెవిడెంట్, డిపాజిట్‌పై వడ్డీ, డిన్నర్‌సెట్ గిఫ్టులు అందజేయడంపై సొసైటీ సభ్యుల సంతృప్తి వ్యక్తం చేశారు. సొసైటీకి విశాఖ డెయిరీ యాజమాన్యం, డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, పాలక మండలి సభ్యులు అందిస్తున్న సహాయ సహకారాలపై సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: తాగునీటి సరఫరాకు మంగళవారం అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా మెయిన్టెనెన్ విభాగం ఏఈ 1 ఎంజీడీ అసిస్టెంట్ ఇంజనీరు డి.మనోహరరావు ఆదివారం తెలిపారు. పంపింగ్ లైనును షీలానగర్ నుంచి గాజువాక హై స్కూల్ రోడ్డుగల రిజర్వాయర్ వరకు వేశామని, పాత ఏసీ పైపు లైనును తీసివేసి కొత్త పైపు లైనును అనుసంధానం చేస్తున్న కారణంగా 66, 67, 68వ వార్డుల్లోని అక్కిరెడ్డిపాలెం, జోగవానిపాలెం, కృష్ణానగర్, బి.సి.రోడ్డు, కణితి రోడ్డు, మెహర్ నగర్, గోకుల్ నగర్ ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడ నుందని తెలిపారు.

రాఖీ సందడి



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పెదగంట్యాడ: అన్నాచెల్లెల్ల అనురాగానికి ప్రతీక రాఖీ పండగ.. రాఖీ పౌర్ణమి వేడుకలకు మండలంలోని సోదరీమణులు సిద్ధమయ్యారు. తమ సోదరులకు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి, హారతులు ఇచ్చి వారు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వరాలతో తలతుగాలని కోరుతూ ఆశీర్వాదం తీసుకుంటారు.. కష్టసుఖాల్లో తోడుండాలని కోరుకుంటారు.. ఎంతో విశిష్టత కలిగిన ఈ పండగను ప్రతి ఇంటా జరుపుకోవడం విశేషం.. తమ సోదరులకు అందమైన రాఖీలు కట్టేందుకు సోదరీమణులు సిద్ధమయ్యారు. రాఖీలను కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలతో మార్కెట్లు, మిఠాయి దుకాణాలు కిటకిటలాడాయి. అలాగే మార్కెట్లో వివిధ రూపాల్లో రాఖీలను సిద్ధం చేశారు. రూ. 10 నుంచి రూ.1000 వరక విలువ గల రాఖీలను విక్రయించేందుకు సిద్ధం చేశారు. వెండితో తయారు చేసిన రాఖీలు వివిధ ఆకృతుల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు మహిళలు పోటీపడ్డారు.

ఇసుక వ్యాపారులపై దాడులు ఆపాలి

గాజువాక : నియోజకవర్గం పరిసర ప్రాంతాల్లో ఇసుకను చిన్న మొత్తంలో విక్రయిస్తున్న చిరు వర్తకులపై దాడులు ఆపాలని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు అచ్యుతరావు, ఆనంద్ కోరారు. చిన్న చిన్న ఇసుక పాయింట్లవద్దకు విజిలెన్స్ అధికారులు వెళ్లి రూ.2 లక్షల వరకు జరిమానా విధిస్తామని బెదిరిస్తున్నారని, కొన్నిచోట్ల కేసులు కూడా నమోదు చేశారని పేర్కొన్నారు. గాజువాక ప్రాంతమంతా కొండవాలు ఎక్కువగా ఉంటుందని, ఇరుకు రోడ్లు కావడంతో లారీలు వెళ్లని పరిస్థితి ఉంటుందన్నారు. మధ్య తరగతి, నిరుపేద కుటుంబాలు అధికంగా నివాసముంటున్నాయన్నారు. వారందరూ ఇళ్లు నిర్మించుకోవడం కోసం చిన్న చిన్న వ్యాపారులవద్ద ఇటుక, పిక్క, ఇసుక వంటి నిర్మాణ సామాగ్రిని కొనుగోలు చేసుకుంటారన్నారు. అలాంటివారు అధిక మొత్తంలో ఒకేసారి కొనుగోలు చేసుకోలేరని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే చిరు వ్యాపారులను ఆశ్రయిస్తుంటారని, అధికారులు కేసులు పెట్టడం భావ్యం కాదని అన్నారు. అధికారులు కృత్రిమంగా ఇసుకను బ్లాక్ చేయడంవల్ల మధ్య తరగతి కుటుంబాలు ఇళ్లు కట్టుకోలేవని, భవన నిర్మాణ కార్మికులు పని కోల్పోతారని అన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించిన తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

శిష్ట కరణాలను ఓబీసీలో చేర్చేందుకు కృషి



కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ భారత హిందీ ప్రచార సభ కార్యదర్శి శ్రీనివాస్ పట్నాయక్

అగనంపూడి: శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చే విధంగా తమవంతు కృషి చేస్తానని దక్షిణభారత హిందీ ప్రచార సభ కార్యదర్శి శ్రీనివాస్ పట్నాయక్ అన్నారు. కూర్మన్నపాలెం శిష్టకరణం అసోసియేషన్ ఆధ్వర్యంలో జంధ్యాల పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూర్మన్నపాలెం సంఘానికి రాష్ట్రంలో అతిపెద్ద సంఘంగా, సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టే సంఘంగా గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. కూర్మన్నపాలెం సంఘానికి ఆదర్శంగా తీసుకొని మిగిలిన సంఘాలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా రెండు వందల కుటుంబాలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు శేఖరమంత్రి శ్రీనివాసరావు, కూర్మన్నపాలెం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గంగవరం గోపి, డి.సత్యారావు, బలివాడ బుచ్చిబాబు, డి.కృష్ణ, బాబు పట్నాయక్, కల్యాణి తదతరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి



గాజువాక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ బాగ్చి

అక్కిరెడ్డిపాలెం: నగర పోలీస్ కమీషనర్ శంఖబ్రత బాగ్చి గాజువాక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ప్రతీ గదిని నిశితంగా పరిశీలించారు. ఖాళీ ప్రాంతంలో మొక్కలు నాటాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని రిజిస్ట్రర్లు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. ఏ ఇబ్బందులున్నా 7995095799 నంబర్‌కు తెలియజేయాలన్నారు. స్టేషన్ బయట ఫిర్యాదుదారులతో మాట్లాడారు. క్రైం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలను పాడవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గాజువాక వంటిల్లు, న్యూ గాజువాక జంక్షన్‌లను సీపీ శంఖబ్రత బాగ్చి పరిశీలించారు. రోడ్లపై తోపుడు బండ్లు, ఇతర వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆదేశించారు. పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ ప్రాంతంలో ఎక్కువ దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా క్రైం పోలీసులు పోలీసింగ్ చేయాలని ఆదేశించారు. క్రైం ప్రివెన్షన్, డిటెక్షన్, ప్రాసిక్యూషన్‌కు ఎంతో ఉపయోగపడే సీసీ కెమెరాలు మరిన్ని వినియోగించాలని సూచించారు.

ఆటపాటలతో అలరించిన కళాకారులు



కోలాట ప్రదర్శనలో చిన్నారులు

మల్కాపురం: గాజువాక మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్(జీమా) ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ కళాకారులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గాజువాక, పారిశ్రామిక ప్రాంత కళాకారుల కోసం అవసరమైన భవనాన్ని త్వరలో అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాకారులు పలు చిత్రాల్లోని పాటలు పాడి అలరించారు. చిన్నారులు చేసిన కోలాట ప్రదర్శన, వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నటులు సత్తిపండు(జబర్దస్త్ ఫేమ్), షేక్ శ్రీను, డ్యాన్సర్ ఝాన్సీ, జీమా అధ్యక్షుడు గుడివాడ శ్రీనివాస్‌రావు, వైస్ ప్రెసిడెంట్ బాలకుమార్, కార్యదర్శి పైడిరాజు యాదవ్ నూనెల, కోశాధికారి ఊకోటి వెంకటేశ్వరరావు(నాని) తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

గాజువాక : మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన అభిమానులు గాజువాకలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. చిరంజీవి జన్మదిన వారోత్సవాలను రక్తదాన శిబిరంతో ఆదివారం ప్రారంభించినట్టు మెగా అభిమానుల సంఘం గౌరవాధ్యక్షుడు కొయిలాడ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ రోడ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. మొత్తం 46 మంది అభిమానులు రక్తదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు, కూటమి నాయకులు తిప్పల రమణారెడ్డి, కొయిలాడ శ్రీనివాసరావు, పాలరౌతు రమణ, గంధం వెంకటరావు, గడసాల అప్పారావు, ప్రసాదుల శ్రీనివాస్, ఆడారి రామకృష్ణ, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ పీఆర్వో దాసరి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అక్కిరెడ్డిపాలెం: కోల్‌కతాలో మెడికో దారుణ హత్య నేపథ్యంలో 69వ వార్డు షీలానగర్‌లో ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన, మానవహారం నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ వైద్యురాలిపై దారుణానికి తెగబడ్డ మృగాళ్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు జి.మణి, శ్రీదేవి, మాధురి, దేవుడమ్మ, పుష్ప, బెల్ (హెచ్‌పీపీ) సీఐటీయూ నాయకుడు ఎస్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

కాళీబరి సమితి ఆధ్వర్యంలో..

ఉక్కునగరం: మెడికో హత్య నేపథ్యంలో ఉక్కునగరం కాళీబరి సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ మంటపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘటన నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిర్వాహకులు, స్టీల్‌ప్లాంట్ జీఎం (ప్రాజెక్ట్స్) అభయంకర్ ఆఔనర్జీ మాట్లాడుతూ పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న వారిపై ఇటువంటి సంఘటనలు జరగడం అమానుషమన్నారు. కార్యక్రమంలో యువకులు, మహిళలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



షీలానగర్‌లో ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి

అగనంపూడి: అగనంపూడి టోల్‌గేటుసమీపంలో రాజీవ్‌నగర్ రహదారిలోని స్టీల్ సిటీ లారీ ఓనర్స్ అసోసియేషన్ పరిధిలో వందలాదిమంది లారీ డ్రైవర్లు, క్లీనర్లకు ఉపయోగపడేలా హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయాలని, తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రంలో కోరారు. స్టీల్‌సిటీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నెల్లి శ్రీనివాసరావు సారథ్యంలో అసోసియేషన్ ప్రతినిధులు కేశరపు శ్రీను, సాలాపు శ్రీనివాసరావు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, గుండాల కన్నారావు, సాలాపు తాతారావు, బత్తిన గణేష్ తదితరులు కలిసి విజ్ఞప్తి చేశారు.

ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలి

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించి పూర్వ వైభవం తీసుకురావాలని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, ఎంపీ పురందేశ్వరి, సెయిల్ డైరెక్టర్ సాగి కాశిరాజును విజయవాడలో కలిసి విజ్ఞప్తి చేసినట్టు బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు తెలిపారు. విశాఖ ఉక్కుకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని, ఉక్కు కర్మాగారం విషయంలో అనేక ప్రకటనలు, అపోహలు వస్తున్న క్రమంలో స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి లోవరెడ్డి, రామారావు కలిసినట్టు ఆయన తెలిపారు.